





# కరపత్రం


SINCE 2014

సోమవారం నవంబర్ 04 2024 | సంపుటి :0 | సంచిక : 26 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# రెండో రాజధానిగా వరంగల్ అభివృద్ధి



**భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.**



వరంగల్: భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వరంగల్‌లో భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలయ మాడ వీధులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఇక్కడి జలాశయాన్ని తాగునీటి జలాశయంగా మారుస్తామని చెప్పారు. భద్రకాళి చెరువు కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వే చేయించి నిర్మాణాలను తొలగిస్తామని చెప్పారు. వరంగల్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్రం అనుమతిస్తే మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటూ గెలవని పార్టీకి.. 100 సీట్లా?: ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణలో నిరంకుశత్వాన్ని తరిమికొట్టి ప్రజలు ప్రజాస్వామ్య పాలనను తెచ్చుకున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కసీటైనా గెలవని పార్టీ.. వంద సీట్లు ఎలా గెలుస్తుందని ప్రశ్నించారు. ఆర్నెళ్ల క్రితమే భారాస పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారని, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి 16 చోట్ల డిపాజిట్లు కూడా రాలేదన్నారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం తప్ప.. ప్రజల వద్దకు వెళ్లింది లేదని విమర్శించారు. ఎక్స్‌వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్న కేటీఆర్‌కు ఎలాన్ మస్క్ సన్మానం చేస్తారని ఎద్దేవా చేశారు.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ



హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. దీపావళి పండుగకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. దీంతో పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి ఎల్బీనగర్ వరకు స్వల్పంగా ట్రాఫిక్ జామ్ అయింది.

## రుణమాఫీ, రేషన్‌కార్డుకు లింకు పెట్టడమేంటి?



## 'బాబా సిద్ధిఖీలానే యోగి ఆదిత్యనాథ్‌ను.. ': ముంబయి పోలీసులకు బెదిరింపు సందేశం

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను హత్య చేస్తామని బెదిరింపుల సందేశం ముంబయి పోలీసులకు



## తెలంగాణలో రైతుల పరిస్థితి గాలిలో దీపంలా మారింది: హరీశ్‌రావు



సిద్దిపేట: తెలంగాణలో రైతుల పరిస్థితి గాలిలో దీపంలా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్ రైతులకు ఇంకా డబ్బులు చెల్లించలేదన్నారు. ఆదివారం సిద్దిపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలోనే 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే ప్రభుత్వం 800 మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసిందని ఆరోపించారు.

“అకాల వర్షానికి చాలా చోట్ల ధాన్యం తడిసిపోయాయి. కొబ్బరికాయలు కొట్టి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు కానీ.. వడ్లు కొనేవారు లేరు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మాటలు ఎక్కువ.. చేతలు తక్కువ. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు రెండు సీజన్లకు రైతు బంధు వేయలేదు. ఎన్ని కష్టాలు వచ్చినా.. కేసీఆర్ రైతు బంధును ఆపలేదు. రైతులకు మేలు చేసే రైతుబీమా లేకుండా చేశారు. కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు లేవు, రైతులకు టార్పాలిన్లు లేవు” అని హరీశ్‌రావు



## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

హైదరాబాద్: ప్రశ్నించిన వారిని జైలులో పెట్టి ప్రభుత్వాన్ని నడపాలని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఏ మీడియా బలం లేకపోయినప్పటికీ ప్రజల నోరు మూయించలేరని చెప్పారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. “ఏ పార్టీతో సంబంధం లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ధర్నా చేస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. దళారీల దగ్గర తక్కువ డబ్బులకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఒక వేళ ప్రభుత్వానికే విక్రయిస్తే.. డబ్బులు వస్తాయో రావో అనే ఆందోళనలో ఉన్నారు. ప్రతి పక్ష నేతలను ఎలా ఇబ్బంది పెట్టాలనే ఆలోచనే తప్ప.. ప్రజా సమస్యలను పరిష్కరించాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు” అని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు.

## 'కాళేశ్వరంపై కమిషన్ వేశారు.. మీపై ఏ కమిషన్ వేయాలి':



సీతారామ ఎత్తిపోతల పథకం పనులకు అనుమతులు లేకుండానే టెండర్లు ఎలా పిలుస్తారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

## డబ్ల్యూటీసీ ఫైనల్.. బరిలో ఐదు జట్లు..

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరడానికి పాయింట్ల పట్టికలో టాప్-5లో ఉన్న జట్లకు అవకాశాలున్నాయి. ఏ జట్టుకు ఎన్ని మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి, ఎన్ని విజయాలు సాధిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా ఫైనల్ చేరతాయో ఓ లుక్కేద్దాం.



# మరీ ఇంత నీచమా

దివంగత రాజశేఖర రెడ్డి కుటుంబం బజారున పడింది. నిన్నటి దాకా వివేకానంద రెడ్డి హత్య నేపథ్యంలో కుటుంబంలో గొడవలు ఏర్పడగా, ఇప్పుడు ఆస్తుల వివాదం తెర మీదకు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు పదహారు మంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వీరిలో కాసు బ్రహ్మానంద రెడ్డికి...

దివంగత రాజశేఖర రెడ్డి కుటుంబం బజారున పడింది. నిన్నటి దాకా వివేకానంద రెడ్డి హత్య నేపథ్యంలో కుటుంబంలో గొడవలు ఏర్పడగా, ఇప్పుడు ఆస్తుల వివాదం తెర మీదకు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు పదహారు మంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వీరిలో కాసు బ్రహ్మానంద రెడ్డికి మినహా మిగతా అందరికీ పిల్లలు ఉన్నారు. చాలా మంది ముఖ్యమంత్రుల పిల్లలు ఎవరో, ఇప్పుడేం చేస్తున్నారో, ఎక్కడ ఉంటున్నారో కూడా చాలా మందికి తెలియదు. మాజీ ముఖ్యమంత్రుల పిల్లల్లో ఒక్క జగన్మోహన్‌రెడ్డి మాత్రమే రాజశేఖర రెడ్డి వారసత్వంతో ముఖ్యమంత్రి కాగలిగారు. అదే సమయంలో రాజశేఖర రెడ్డి కుటుంబంలో మరే ఇతర మాజీ ముఖ్యమంత్రుల ఇళ్లలో జరగని విధంగా గొడవలు కూడా తార స్థాయికి చేరాయి. అధికారంతో పాటు సంపద కూడా పోగవడంతో పంపకాల్లో వివాదం ఏర్పడింది. అటు అధికారంలోనూ, ఇటు సంపద పంపిణీలోనూ అన్న జగన్మోహన్‌రెడ్డి తనకు న్యాయం చేయలేదన్న ఆవేదనతో చెల్లి షర్మిల రాజకీయంగా వేరు కుంపటి పెట్టుకున్నారు. ఏ పార్టీని అంటిపెట్టుకొని రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారో ఆ పార్టీ తనకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని ఆగ్రహించి జగన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకొని ముఖ్యమంత్రి కాగా, చెల్లి షర్మిల తన తండ్రి నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీకే రాష్ట్ర అధ్యక్షురాలిగా ఇప్పుడు ఉన్నారు. ఈ నేపథ్యంలో వారి మధ్య ఉన్న ఆస్తుల వివాదం తెర మీదకు వచ్చింది. తాను ఆశించిన రాజ్యసభ పదవి లభించి ఉంటే అన్నతో షర్మిల విభేదించి ఉండేవారు కాదు. వైసీపీలో తన పాత్ర లేకుండా పోవడానికి వదిన భారతి కారణం అన్నది షర్మిల భావన! అదే సమయంలో రాజశేఖర రెడ్డి సొంత తమ్ముడైన వివేకానంద రెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాశ్ రెడ్డికి జగన్ దంపతులు వత్తాసు పలకడం కూడా రాజశేఖర రెడ్డి కుటుంబంలో విభేదాలు భగ్గుమనడానికి ప్రధాన కారణమైంది. ఇప్పుడు అన్నాచెల్లెళ్ల మధ్య ఆస్తుల వివాదం కూడా వచ్చిపడింది. దీంతో రాజశేఖర రెడ్డి భార్య శ్రీమతి విజయలక్ష్మి నోరు విప్పాల్సి వచ్చింది. కుటుంబ ఆస్తులలో జగన్, షర్మిలకు సమాన హక్కు ఉందని, అలా ఉండాలన్నది రాజశేఖర రెడ్డి ఆజ్ఞ అని ఆమె బహిరంగ లేఖ ద్వారా తేల్చి చెప్పారు. రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆస్తుల విషయంలో గానీ, మరే విషయంలో గానీ ఏమనుకున్నదీ చెప్పగలిగే సజీవ సాక్ష్యం విజయలక్ష్మి మాత్రమే. అయితే విజయలక్ష్మి చెప్పిన విషయాలతో జగన్మోహన్‌రెడ్డితో పాటు ఆయనకు మద్దతు ఇస్తున్న వారు విభేదిస్తున్నారు. సోషల్ మీడియాలో పలువురు పోస్టులు, వీడియోల రూపంలో జగన్మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. ఆస్తుల్లో వాటా ఉన్న మాట నిజమైతే షర్మిలపై కేసులు ఎందుకు లేవు? ఉమ్మడి ఆస్తులైతే ఎంఓయూ అవసరం ఏమిటి? వంటి ప్రశ్నలను లేవనెత్తడంతో పాటు షర్మిలను విలన్‌గా ప్రొజెక్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. తాజా ఎన్నికల్లో చిత్తుగా ఓడిన తర్వాత కూడా జగన్‌రెడ్డికి మద్దతుగా సోషల్ మీడియాలో అంతమంది నిలబడడం ఆశ్చర్యంగా ఉంది. దీన్నిబట్టి వారందరినీ జగన్‌రెడ్డి బాగా సంతృప్తిపరుస్తున్నట్టు భావించాలి. రాజశేఖర రెడ్డి భార్యగా, కుటుంబ పెద్దగా విజయలక్ష్మి చెప్పిన అంశాలతో కూడా జగన్ మద్దతుదారులు విభేదించడం ఆశ్చర్యం కలిగించింది.

అప్పట్లో ఏమి జరిగిందో చెప్పగలిగే అర్హత విజయలక్ష్మికి కాక మరెవరికి ఉంటుంది? రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు, తర్వాతా ఏం జరిగిందో ఆమెకు తెలియకుండా ఎలా ఉంటుంది? అయినా విజయలక్ష్మి చెబుతున్న దాంట్లో వాస్తవం లేనట్టుగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ ఆస్తులు ఎలా వచ్చాయి? అవి అక్రమ ఆస్తులా? సక్రమ ఆస్తులా? అన్న అంశాలు మరుగున పడిపోయాయి. అన్న, చెల్లెలు ఏ ఆస్తుల కోసం గొడవ పడుతున్నారో ఆ ఆస్తులన్నీ అక్రమ సంపాదన అంటూ సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసి జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా చార్జిషీట్లు కూడా దాఖలు చేశాయి. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే క్విడ్ ప్రో కో అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్‌రెడ్డి అంతులేని సంపదను పోగేసుకున్నారని, పలు కంపెనీలు ఏర్పాటు చేశారని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. ఇందులో నిజం ఉందా? లేదా? అన్నది న్యాయస్థానంలో తేలాల్సి ఉంది. వ్యవస్థలను, వ్యక్తులను ప్రభావితం చేస్తుండటం వల్ల సదరు కేసులు విచారణకు నోచుకోకుండా మూలుగుతున్నాయి. జగన్‌రెడ్డి నిజంగానే అనితర సాధ్యమైన తెలివితేటలతో సదరు ఆస్తులను సమకూర్చుకొని ఉంటే విచారణలో జాప్యం జరగకుండా సహకరించి తాను నిర్దోషినని రుజువు చేసుకుంటే ఏ గొడవా ఉండదు. అలా జరగడం లేదంటేనే అనుమానాలు బలపడుతున్నాయి. వివేకానంద రెడ్డి హత్య కేసు విషయంలో కూడా ఇదే జరుగుతోంది. ఈ కేసు విచారణ జరిగే అవకాశం కనుచూపు మేరలో కనిపించడం లేదని హైకోర్టు న్యాయమూర్తి స్వయంగా వ్యాఖ్యానించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో అక్రమాస్తులో, సక్రమాస్తులో నిర్ధారణ కాని ఆస్తుల పంపకాలపై అన్నాచెల్లెళ్ల మధ్య విభేదాలు రాజుకున్నాయి. ఆస్తి పంపకాలలో కూతురికి అన్యాయం జరగడాన్ని జీర్ణించుకోలేని విజయలక్ష్మి నోరు విప్పారు.

ఇప్పుడు విజయలక్ష్మి లేఖలోని అంశాల విషయానికి వద్దాం. ఆస్తులు ఎలా పంచుకోవాలో రాజశేఖర రెడ్డి స్పష్టంచేశారని విజయలక్ష్మి చెబుతున్నందున అలా ఎలా? అని అడిగే అర్హత ఇతరులకు, ముఖ్యంగా జగన్ మద్దతుదారులకు ఉండదు. షర్మిల వాదనలో పస లేదని రాజశేఖర రెడ్డి తోడల్లుడైన వైవీ సుబ్బారెడ్డి, అప్పటి ఆడిటర్, అవినీతి కేసుల్లో ఏ%-%2గా ఉన్న విజయసాయి రెడ్డితో జగన్‌రెడ్డి చెప్పించడంతో విజయలక్ష్మి రంగప్రవేశం చేశారు. ఇదీ నిజం అంటూ బహిరంగ లేఖ రాశారు. అయినా సోషల్ మీడియాలో జగన్ మద్దతుదారులు విజయలక్ష్మిపై కూడా ప్రశ్నలు సంధిస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారి పిల్లలు ఎవరూ కూడా ఇలా ఆస్తుల కోసం కొట్టుకోలేదన్న విషయాన్ని జగన్ మద్దతుదారులు విస్మరిస్తున్నారు. విజయలక్ష్మి లేఖ తర్వాత ఆస్తుల్లో షర్మిలకు సమాన హక్కు ఉన్న పక్షంలో ఎంఓయూ రాసుకోవాల్సిన అవసరం ఏమి వచ్చిందని వైసీపీ నాయకులు కూడా ప్రశ్నిస్తున్నారు. మామూలుగా అయితే ఇందులో లాజిక్ ఉంది. ఎంఓయూ అవసరం ఏమిటో తెలియాలంటే రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఏమనుకున్నారో, ఏం జరిగిందో తెలుసుకోవాలి. ముందుగా విజయలక్ష్మి తన లేఖలో పేర్కొన్న విషయాలు నిజం కాని పక్షంలో వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి వాటిని ఎందుకు ఖండించలేదో చెప్పాలి. ఎందుకంటే విజయలక్ష్మి చెప్పినవన్నీ అక్షర సత్యాలని ఆ ఇద్దరికీ తెలుసు. అందుకే వారు అబద్ధాలు చెప్పారని విజయలక్ష్మి అన్నప్పటికీ నోరు మెదపడం లేదు. షర్మిలకు వ్యతిరేకంగా, జగన్‌కు అనుకూలంగా వైవీ సుబ్బారెడ్డి విలేఖరుల సమావేశం పెట్టిన తర్వాత.. ఆయన కుమారుడు విజయలక్ష్మి వద్దకు వెళ్లి 'మా నాన్నను అపార్థం చేసుకోవద్దు పెద్దమ్మా. జగన్ వద్ద మేం జీతగాళ్లం మాత్రమే. మమ్మల్ని అర్థం చేసుకోండి' అని చెప్పుకొన్నారు. ఇది నిజమో కాదో జగన్ మద్దతుదారులు తెలుసుకోవాలి. దీన్నిబట్టి ఎవరు చెబుతున్నది నిజమో? ఎవరి పక్షాన ధర్మం ఉందో? ఎవరు న్యాయం చేయాలనుకుంటున్నారో? ఎవరు అన్యాయం చేస్తున్నారో స్పష్టమవుతుంది.

### సాయీ.. బిడ్డకు అన్యాయం జరగొద్దు!

రాజశేఖర రెడ్డి జీవించి ఉన్నప్పుడే ఆస్తుల పంపకం ఎందుకు జరగలేదన్నది ఇప్పుడు కీలకం. వాస్తవానికి 2004కు ముందు రాజశేఖర రెడ్డికి ఉన్న ఆస్తులను జగన్, షర్మిల మధ్య పంచారు. తంటా అంతా 2004లో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సమకూరిన ఆస్తుల విషయంలోనే. అధికారాన్ని అడ్డుపెట్టుకొని నెలకొల్పిన కంపెనీలు, సమకూర్చుకున్న ఆస్తులు జగన్‌రెడ్డి పేరు మీదనే ఎందుకున్నాయో ఆడిటర్‌గా ఉన్న విజయసాయి రెడ్డికి తెలుసు. ఒక దశలో

# డబ్ల్యూటీసీ ఫైనల్..
# బరిలో ఐదు జట్లు..

మొదటిపేజీ తరువాయి

న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో టీమ్‌ఇండియాకు వైట్‌వాష్ తప్పలేదు. ముంబయిలో జరిగిన మూడో టెస్టులో విజయానికి చేరువైన భారత్.. చివరకు 25 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ లో టీమ్‌ఇండియా అగ్రస్థానాన్ని కోల్పోయింది. అంతేకాకుండా డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా (62.50 శాతం) టాప్‌లో ఉంది. భారత్ (58.33 శాతం), శ్రీలంక (55.56 శాతం), న్యూజిలాండ్ (54.55 శాతం), దక్షిణాఫ్రికా (54.17 శాతం) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ ఐదు జట్లు డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడానికి అవకాశాలున్నాయి. ఏ జట్టుకు ఎన్ని మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి, ఎన్ని విజయాలు సాధిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా ఫైనల్ చేరతాయో ఓ లుక్కేద్దాం.

### ఆస్ట్రేలియా

ప్రస్తుతం డబ్ల్యూటీసీ టేబుల్‌లో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా.. ఇంకా ఏడు టెస్టులు ఆడాల్సి ఉంది. స్వదేశంలో భారత్ ఐదు టెస్టులు (బోర్డర్-గావస్కర్ ట్రోఫీ) ఆడనుంది. తర్వాత రెండు టెస్టుల సిరీస్ కోసం శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఆసీస్ ఈ ఏడు మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధిస్తే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా ఫైనల్‌కు చేరుతుంది.

### భారత్

ప్రస్తుత టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఇంకా ఐదు మ్యాచ్‌లే ఆడాల్సి ఉంది. నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియాతో బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ప్రారంభంకానుంది. ఆసీస్ వేదికగా జరిగే ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్ భారత్‌కు సవాలుగా మారింది. టీమ్‌ఇండియా (%ఖుఎ ×అఎఖు%) డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే ఈ సిరీస్‌ను 4-0తో కైవసం చేసుకోవాలి. అంటే నాలుగు మ్యాచ్‌ల్లో తప్పక విజయం సాధించడంతోపాటు మరో మ్యాచ్‌లో విజయం సాధించకపోయినా కనీసం డ్రా చేసుకోవాలి. ఆసీస్‌ను సొంత గడ్డపై 4-0తో ఓడించడం అంత తేలికైన విషయం కాదు.

### శ్రీలంక

శ్రీలంక ఇటీవల న్యూజిలాండ్‌పై రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుని డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులోకి వచ్చింది. లంక ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఇంకా నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో రెండు మ్యాచ్‌లు సౌతాఫ్రికాలో, రెండు మ్యాచ్‌లు స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఆడనుంది. ఈ నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధిస్తేనే శ్రీలంక ఫైనల్ చేరుతుంది.

### న్యూజిలాండ్

శ్రీలంక చేతిలో ఘోర ఓటమి చవిచూసిన కివీస్.. భారత్‌తో టెస్టు సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుని డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులోకి దూసుకొచ్చింది. న్యూజిలాండ్ ఈ డబ్ల్యూటీసీలో ఇంకా మూడు మ్యాచ్‌లే ఆడాల్సి ఉంది. నవంబర్‌లో ఇంగ్లాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో కివీస్ తలపడనుంది. ఈ మూడింట కచ్చితంగా గెలవడంతో ఇతర జట్ల ఫలితాలూ అనుకూలిస్తే న్యూజిలాండ్ ఫైనల్ చేరడానికి అవకాశాలున్నాయి.

### సౌతాఫ్రికా

బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌ను సౌతాఫ్రికా 2-0తో కైవసం చేసుకుని డబ్ల్యూటీసీ టేబుల్‌లో టాప్-5లోకి వచ్చింది. సఫారీలు ఇంకా నాలుగు టెస్టులు ఆడాల్సి ఉంది. శ్రీలంక, పాకిస్థాన్‌తో రెండేసి టెస్టులు ఆడనున్న దక్షిణాఫ్రికా ఈ నాలుగు మ్యాచ్‌ల్లోనూ తప్పక విజయం సాధించాలి. అలా జరిగితే ఏ జట్టు ఫలితాలతో సంబంధం లేకుండా ఫైనల్ చేరుతుంది. అయితే, ఇవన్నీ స్వదేశంలో ఆడనుండటం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం.

# 'బాబా సిద్ధిఖీలానే యోగి ఆదిత్యనాథ్‌ను.. ': ముంబయి పోలీసులకు బెదిరింపు సందేశం

మొదటిపేజీ తరువాయి

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను హత్య చేస్తామంటూ ముంబయి పోలీసులకు బెదిరింపు సందేశం వచ్చింది. "బాబా సిద్ధిఖీలాగా యూపీ సీఎంను చంపుతాం" అంటూ దుండగులు అందులో హెచ్చరించారు. ఆయన పది రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఈ మెసేజ్ వచ్చినట్లు తెలుస్తోంది.

గత నెలలో మహారాష్ట్ర ఎన్సీపీ పవార్ వర్గం నేత బాబా సిద్ధిఖీని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. బాలీవుడ్ స్టార్ సల్మాన్‌తో సన్నిహితంగా ఉన్నందుకే చంపామని నిందితులు చెప్పారు. ఆ తర్వాత నుంచి పలువురికి లారెన్స్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. సిద్ధిఖీ కుమారుడు జీశాన్ కూడా హిట్‌లిస్ట్‌లో ఉన్నట్లు వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఇటీవలే అతడికి కూడా బెదిరింపు కాల్స్ వచ్చాయి.

### గంటల్లోనే నిందితురాలి అరెస్టు..

ఈ బెదిరింపులను తీవ్రంగా పరిగణించిన ముంబయి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫాతిమా ఖాన్ అనే మహిళ ఫోన్ నుంచి ఈ మెసేజ్ వచ్చినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బీఎస్సీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పూర్తి చేసిన ఆమె ఇటీవల కాలంలో తీవ్రమైన మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. థానేలోని ఉల్హాస్ నగర్‌కు చెందిన నిందితురాలి వయస్సు 24 సంవత్సరాలు. ఆమె తండ్రి టింబర్ వ్యాపారి.

# డీఎంకే, భాజపాపై విజయ్ విమర్శలు.. జమిలి ఎన్నికలపై టీవీకే వైఖరి ఇదే!



చెన్నై: దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'జమిలి' ప్రతిపాదనను ప్రముఖ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ వ్యతిరేకించారు. ఒకే దేశం - ఒకే ఎన్నికను అమలు చేసే ప్రయత్నం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందని, ఈ చర్యను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. తన పార్టీ జిల్లా ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులతో ఆదివారం తొలిసారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీవీకేని సంస్థాగతంగా బలోపేతం చేయడం, ప్రజలకు చేరువయ్యే అంశాలపై ప్రధానంగా చర్చించి 26 తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా డీఎంకే, భాజపా పాలనపై మండిపడిన విజయ్.. తమిళనాడులో శాంతిభద్రతల అంశంపై విమర్శలు గుప్పించారు. తమిళనాడులో కులగణన చేపట్టాలని కోరిన ఆయన.. పరందూర్ విమానాశ్రయం ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిర్దేశిత గడువు నిర్దేశించుకొని క్రమంగా మద్యం దుకాణాలను మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, భాజపా సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తీరుపైనా విమర్శలు చేశారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ (%జీూజ%) రివ్యూలో ఉన్న వక్ఫ్ సవరణ బిల్లు- 2024ను ఫెడరలిజంపై దాడిగా పేర్కొన్నారు. ఈ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నీట్‌ను రద్దు చేయాలన్న డిమాండ్‌కు మద్దతుగా నిలిచిన విజయ్.. విద్యను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాలోకి మార్చాలని కోరారు. తమిళనాడు ప్రజల సామరస్యత, ఐక్యత కోసం పనిచేసే తమ పార్టీ సిద్ధాంతం లౌకిక వాదం, సామాజిక న్యాయమేనన్నారు.

# 'కాళేశ్వరంపై కమిషన్ వేశారు.. మీపై ఏ కమిషన్ వేయాలి' :

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకం పనులకు అనుమతులు లేకుండానే టెండర్లు ఎలా పిలుస్తారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. కోటి ఎకరాలకు నీరందిస్తున్న కాళేశ్వరంపై కమిషన్ వేశారు. ఇప్పుడు మీపై ఏ కమిషన్‌తో విచారణ చేయించాలని దుయ్యబట్టారు. మత్స్యకారుల జీవితాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మట్టి కొట్టిందని.. రాష్ట్రంలో 20 వేల టన్నుల మత్స్య సంపద దిగుబడి తగ్గడంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారితే పథకాల పేర్లు మారుతాయనీ.. కానీ కాంగ్రెస్ పాలనలో పథకాలే నామరూపాలు లేకుండాపోయాయని 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. మూసీ మురికిలో రూ.కోట్లు కుమ్మరించడంపై ఉన్న ప్రేమ.. జలాశయాల్లో జలపుష్పా(చేపలు)లను వదలడంలో లేదని విమర్శించారు. ఉపాధి లేక బోసిపోయిన బెస్తవాడలపై.. వారి దీన స్థితిపై ప్రభుత్వానికి కనీసం పట్టింపు లేదని పోస్టులో పేర్కొన్నారు.

# రుణమాఫీ, రేషన్‌కార్డుకు లింకు పెట్టడమేంటి?

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రుణమాఫీ చేస్తామని, రైతుబంధు పెంచి ఇస్తామని చేసిన వాగ్దానాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎగ్గొట్టిందని భాజపా ఎంపీ కె.లక్ష్మణ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'రైతులకు రైతుబంధు రాదు, రుణమాఫీ పూర్తి కాదు, బోనస్ బోగస్ అయిపాయే' అని ఎద్దేవా చేశారు. పంటలు కొనే దిక్కు లేదు.. పత్తి రైతులకు మద్దతు ధర లేదన్నారు. రైతులకు వ్యవసాయ రుణాలు ఇచ్చే సమయంలో రేషన్ కార్డు ఆధారంగా ఇచ్చారా? రుణమాఫీకి, దీనికి లింకు పెట్టడమేంటి?అని ప్రశ్నించారు.

"అధికారంలోకి వచ్చేందుకు మాయమాటలు చెప్పారు. రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక రోజుకో మాట మాట్లాడుతూ అన్నదాతలను మోసం చేస్తున్నారు. కాంగ్రెస్ వచ్చాక 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్న రేవంత్ రెడ్డి.. ఆ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు, పరీక్షలు ఎప్పుడు నిర్వహించారో చెప్పే దమ్ముందా? గతేడాది శాసనసభ ఎన్నికలకు ముందు ఏడాదిలో 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి విద్యార్థులకు నమ్మబలికారు.. ఆ హామీలన్నీ ఏమయ్యాయి? అధికారంలోకి వచ్చిన పది నెలల్లో కాంగ్రెస్ నాయకులు 25 విదేశీ పర్యటనలు చేశారు. రైతుబంధు, రుణమాఫీకి పైసలు లేవు కానీ మీ విదేశీ పర్యటనలకు డబ్బులు ఎక్కడినుంచి వస్తున్నాయి? పథకాలను అమలు చేయకుండా తెరపైకి రోజుకో డైవర్షన్ తెస్తూ హై'డ్రామా' చేస్తున్నారు. కొత్త ప్రాజెక్టులు నిర్మించడం లేదు.. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలేదు. తేమ పేరుతో అడ్డగోలుగా కొర్రీలు పెట్టి పత్తి కొనకుండా నిరాకరిస్తున్నారు. 420 హామీల అమలు చేతకాక రోజుకో డ్రామా ఆడుతున్నారు" అని లక్ష్మణ్ విమర్శించారు.

# వారి కోసం రూ.లక్షల కోట్ల రుణమాఫీ.. మరి మీ కోసం..?: ప్రియాంక గాంధీ



కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ కేంద్రంలోని మోదీ సర్కార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు.

వయనాడ్: త్వరలో వయనాడ్ లో జరగనున్న ఉప ఎన్నికలో విజయం సాధించేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అక్కడ ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్న ఆమె.. వయనాడ్ ప్రజల కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా భాజపాపై తీవ్ర ఆరోపణలు చేశారు.

"నా సోదరుడు రాహుల్ గాంధీ సత్యం కోసం ఎంతో పోరాటం చేస్తున్నారు. ఈ విషయం వయనాడ్ ప్రజలకు అర్థమైంది. అతడికి వ్యతిరేకంగా తప్పుగా ప్రచారాలు జరిగాయి. అవన్నీ ఆరోపణలని వయనాడ్ గ్రహించింది. స్థానిక మెడికల్ కళాశాలలో సౌకర్యాలను మెరుగుపరచడానికి ఆయన ఎంతో పోరాడారు. అయితే.. ఆ సౌకర్యాలు మరింత మెరుగుపడాల్సి ఉంది. ఆ సమస్యలను పరిష్కరిస్తాను" అని హామీ ఇచ్చారు.

"రాహుల్ గాంధీ ఓ మార్గం చూపారు. ఆయన మీ సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తారు. కానీ, ప్రభుత్వాలు మాత్రం ప్రజల కోసం పని చేయడం లేదు. దేశానికి వెన్నెముక అయిన రైతును మోదీ సర్కార్ పట్టించుకోవడం లేదు. కనీసం మద్దతు ధర ప్రకటించలేదు. వారికి మిత్రులైన కొందరు వ్యాపారవేత్తలకు రూ. 16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారు. కానీ, మీ సమస్యలను పరిష్కరించాలని అనుకోవడం లేదు. ఉద్యోగ అవకాశాలు, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం వారి లక్ష్యం కాదు. అధికారం కోసమే వారి పోరాటం. అందుకోసం సమాజాన్ని విభజించి, ద్వేషాన్ని వ్యాప్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు" అని ప్రియాంక గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు.

అది నా అదృష్టం: రాహుల్

తన సోదరి తరఫున రాహుల్ ఈ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రియాంక గాంధీ నా సోదరి కావడం నిజంగా నా అదృష్టం. ఆమె మీకు తల్లి, సోదరి, కూతురిలా

# మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో వైద్య సేవలు.







**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.**

నవంబర్3 ప్రముఖ ఆరోగ్య సంస్థల సంఘం, తెలంగాణ హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (తానా ) ఆధ్వర్యంలో హైదరాబాద్లోని నోవోటెల్ లో నిర్వహించిన తానాకాన్ -2024 కార్యక్రమలో , తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ సమక్షంలో, మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి. రఘునాథ్ స్వామి ని సన్మానించడం జరిగింది.డాక్టర్ టి రఘునాథ్ స్వామి మెడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పలు ఆరోగ్య కార్యకలాపాలలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ ప్రాంతంలో ప్రజారోగ్య రంగంలో, ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, మెరుగైన వైద్య సేవల అందుబాటులోకి తీసుకురావడం. మరియు వైద్య సౌకర్యాలు అందించడం వంటి కార్యకలాపాలలో ఆయన చేసిన కృషి అభినందనీయమైంది.అనేక ఆరోగ్య , నివారణ చర్యలు, మరియు సామూహిక ఆరోగ్య భద్రతకు సంబంధించిన కార్యక్రమాల అమలులో ఆయన తన అపూర్వమైన నిబద్ధతను ప్రదర్శించారు. డా టి రఘునాథ్ స్వామి మాట్లాడుతూ ప్రజలకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లో వైద్య సేవలు అందించే దిశగా ఆయనకి తోడ్పడిన ప్రతి అధికారికి మరియు సిబ్బందికి కృతజ్ఞత తెలిపారు

# ధాన్యం కొనుగోలులో అంతులేని జాప్యం..

- అన్ని రకాల వడ్లకు
- రూ. 500 బోనస్ ఇవ్వాల్సిందే
- కొనుగోలు కేంద్రాలలో
- నిండిపోతున్న ధాన్యం రాశులు
- ఆందోళన తప్పదన్న
- కేంద్రమంత్రి బండి ..



**కరపత్రం శంకరపట్నం నవంబర్ 3:-**
ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా, కరీంనగర్ పార్లమెంట్ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం బిజెపి శ్రేణులు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలలో వినతి పత్రాలు అందజేస్తారని చెప్పారు.రాష్ట్రంలో వరి కోతలు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా నేటికీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం బాధాకరమన్నారు. కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, ఆచరణకు పొంతనే లేకుండా పోయిందని ఆరోపించారు.రాష్ట్రవ్యాప్తంగా 7,572 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం అందులో ఇప్పటికే 4598 కేంద్రాలను తెరిచినట్లు పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు.కానీ రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలోనూ ఇంతవరకు వడ్ల కొనుగోలు ప్రారంభమే కాలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు వడ్ల కుప్పలు పోసి రోజుల తరబడి ఎదురు చూస్తున్నారని,వడ్ల కుప్పలతో కొనుగోలు కేంద్రాలన్నీ నిండిపోవడంతో... స్థలం లేక వడ్లను తీసుకొచ్చిన రైతులు రోడ్లపై రాశులుగా పోస్తున్నారని,దీనివల్ల అటు రైతులకు, ఇటు వాహనదారులకు కూడా ఇక్కట్లు తప్పడం లేదన్నారు. గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలవల్ల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వడ్లు తడిసిపోయాయని, చాలా చోట్ల కోతకు వచ్చిన పంట వర్షాలవల్ల నీళ్లపాలైందనిఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని చొప్పదండి, సిరిసిల్ల, మానకొండూరు, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల్లో వడ్లు తడిసిపోయాయన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన వడ్లు సైతం తడిసిపోవడంతో ఎక్కడ చూసినా ఎండబెట్టిన వడ్ల కుప్పల దృశ్యాలే దర్శనమిస్తున్నాయని ,రైతులు ఆరుగాలం పండించిన పంటను కాపాడుకోవడం ఒక ఎత్తయితే, చేతికొచ్చిన పంటను అమ్ముకోవడం కూడా వారికి తలకు మించిన భారంగా మారిందన్నారు. నెల రోజులవుతున్నా వడ్లను కొనుగోలు చేయకపోవడం వెనుక కుట్ర దాగి ఉన్నట్లు తెలుస్తోందని ఆయన విమర్శించారు. కొనుగోలు కేంద్రాల తీరుతో రైతులు విసిగిపోయి వడ్లను తక్కువ ధరలకు మిల్లర్లకు అమ్ముకునేలా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వడ్ల కొనుగోళ్లను ప్రారంభించాలని,ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తమ ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని రకాల వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోసన్ ఇస్తామని హామీ ఇచ్చి,ప్రస్తుతం సన్న వడ్లకు మాత్రమే బోనస్ చెల్లిస్తామని మెలిక పెట్టడం సమంజసం కాదన్నారు.అన్ని రకాల వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లించి ఎన్నికల హామీని నెలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.సన్న వడ్లకు బోనస్ అందించే విషయంలోనూ పరిమితి విధించినట్లు తెలిసిందన్నారు. ఎకరాకు 30 క్వింటాళ్ల మేరకు సన్న వడ్లు పండినప్పటికీ.అందులో కొంత మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని, అట్లాగే సన్న వడ్లను నిర్ధారించేందుకు అనేక కొలతలను ప్రామాణికంగా చేయాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు పంపినట్లు తనకు సమాచారం ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులు పండించిన ప్రతి వడ్ల గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, అన్ని రకాల వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లించాలని, ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సనాతన ధర్మం అంటే ఫిలాసఫీ కాదు.

- మానవ సంబంధాన్ని పరిపుష్టి చేసేది.
- మనిషి యొక్క బాధ్యతలు తెలియజెప్పి,
- ఎలా జీవించాలో చెప్పగలిగే ధర్మం.
- ఈటల రాజేందర్.



**కరపత్రం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా**
ఒకనాడు భారతదేశం విశ్వగురు స్థానంలో ఉందని మనం ఎంత గర్వంగా చెప్పుకున్నామో.. విదేశీయుల యొక్క దురాక్రమణలు, దుర్మార్గాల వల్ల అది కనుమరుగైపోయి, ఇప్పుడిప్పుడే ప్రపంచం మళ్ళీ భారత దేశ సంస్కృతిని, సంప్రదాయాన్ని గుర్తిస్తున్నది.మళ్లీ విశ్వ గురు స్థానాన్ని రావాలని చెప్పి మనం భావిస్తున్నాము.అందుకోసం మన ప్రధాని నరేంద్ర మోడీ అహర్నిశలు కృషి చేస్తున్నారు.ఈనాడు మనకు కనపడేది, వినబడేది ఆనాడే మన సంస్కృతిలో సాంప్రదాయంలో ఉన్నవి ఇవాళ కొత్తగా చెప్పేవి కావు.ఏ ఊరికి వెళ్ళినా ఒక గుడి, ఆ గుడికి ఒక పూజారి ఉంటాడు. గుడిలేని ఊరు వళ్ళకాడుతో సమానమని చెప్తుంటారు. భారతదేశంలో ఈ పాశ్చాత్యనాగరికత వల్ల మన ధర్మం, సంస్కృతి - సాంప్రదాయాలు ఎట్లా విగాథం కలుగుతున్నాయో ఎంత చెప్పిన ఒడవదు. కేవలం అభివృద్ధి పేరిట రోడ్డును, రైల్వే స్టేషన్లను చూసి మనం ఆహా ఓహెూ అని చెప్పి మాట్లాడుతున్నాం.. కానీ మానవ సంబంధాలు కనుమరుగై అనేక రకాల వినకూడని కనకూడని అంశాలు మనం చూసినప్పుడల్లా బాదేస్తుంది.సమాజాన్ని చల్లగా, సక్రమంగా నడిపించే తత్వం మన ప్రాచీనత్వం.దానిని కాపాడే వాళ్ళు బ్రాహ్మణులు.సనాతన ధర్మం అంటే ఫిలాసఫీ కాదు.మానవ సంబంధాన్ని పరిపుష్టి చేసేది. మనిషి యొక్క బాధ్యతలు తెలియజెప్పి, ఎలా జీవించాలో చెప్పగలిగే ధర్మం.సమాజానికున్న టెన్షన్ ను బొమ్మాట్ చేయగలిగేది సనాతన ధర్మం ఒకటే.జ్ఞానాన్ని, మానవ సంబంధాల్ని, సమాజంలో ఎలా ఉండాలో నేర్పాలంటే ఇంట్లో తాతలు నానమ్మలు అమ్మమ్మలు ఉండాలి. వారిని లేకుండా అనాధరాశ్రమంలో వేసే పద్ధతి మంచిది కాదు. కనకూడని, వినకూడని అనేక దురాగతాలు దుర్మార్గాలు సమాజంలో చూస్తున్నాం. వీటిని కంట్రోల్ చేయగలిగే శక్తి ప్రభుత్వాలకు లేదు. కంట్రోల్ చేయగలిగే శక్తి మన ధర్మానికి, సంస్కృతికి ఉందని మర్చిపోవద్దు. ఆ ధర్మాన్ని, సంస్కృతిని సమున్నతంగా నిలిపేది మన బ్రాహ్మణులు మాత్రమే.నాగోల్ లో ఉండే ఒక రిటైర్డ్ టీచర్ నాకు ఫోన్ చేసి నేను గుజరాత్ కు వెళ్తాను అంటే ఎందుకని నేను అడిగాను నాకు ఇద్దరు కొడుకులు ఒక కొడుకు అమెరికాలో ఉన్నాడు, ఇంకొక కొడుకు మద్యానికి బానిస అయ్యాడు.గుజరాత్ లో మద్యం నిషేధం అంట కదా..ఇక్కడ కిరాణా షాపులలో, ఇళ్లలో కూడా మద్యం అమ్ముతున్నారు.ఇక్కడ ఉంటే నా కొడుకుని బతికించుకోలేను అంటున్నారు. ఇక్కడ గుడి పక్కన బడి పక్కన కూడా వైన్ షాపులు పెడుతున్నారు. ఊళ్ళల్లో జ్వరం వస్తే టాబ్లెట్ దొరకదేమో కానీ కుతి లేస్తే మాత్రం మద్యం దొరికే పద్ధతి వచ్చింది.రిటైర్డ్ అయిన తరువాత శాంతి, సుఖంగా ఉండవలసిన ప్రిన్సిపాల్ తన కొడుకును కాపాడుకోవడానికి గుజరాత్ వెళ్లడానికి సిద్ధపడిందంటే సమాజం ఎటు పోతుందో అర్థం చేసుకోవాలి.పౌరోహిత్యమునే నమ్ముకొని గ్రామీణ ప్రాంతాలలో ఉండే బ్రాహ్మణులు ఎలా ఇబ్బంది పడుతున్నారో చూస్తా ఉన్నాం. బ్రాహ్మణులకు జ్ఞానం, మేధాసంపత్తు ఉండొచ్చు కానీ పేదరికంలో ఉండేవారు చాలామంది ఉన్నారు.బ్రాహ్మణ పరిషత్తు అనేక సంవత్సరాలుగా వాళ్లకోసం ప్రభుత్వం దగ్గర కొట్లాడి కొన్ని పొందే ప్రయత్నం చేస్తున్నారు.దానికి మా మద్దతు కూడా ఉంటుందని తెలియజేస్తున్నాను.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...



**కరపత్రం శంకరపట్నం నవంబర్ మూడు**
పూర్వ విద్యార్థులు ఒకచోట ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకొని, తమ చిన్ననాటి పాఠశాలలో చదువుకున్న వేళలను జరిగిన ఆత్మీయతను గుర్తుచేసుకొని ఆత్మీయతను చాటుకున్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకర పట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 1986-87 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అందరు కలిసి, ఆత్మీయతను పంచుకొని పూర్వ గురువులకు ఘనంగా సన్మానం చేసి ఆప్యాయతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గురువులు పాల్గొన్నారు.

## ఎదులాపురం లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు

**కరపత్రం హుజురాబాద్/ నవంబర్ 3,**



ఎదులాపురం లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి ఐనందున సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని..సంఘ్ ఏదులపురం శాఖ ఆధ్వర్యంలో. నవంబర్ 3, ఆదివారం రోజున సాయంత్రం ఐదు గంటలకు పట్టణములో ఎద్దులాపురం నగర పుర వీదుల గుండా విద్యానగర్ శిశుమందిర్ ఏరియా నుండి హనుమాన్ టెంపుల్ మీదుగా అంబేద్కర్ చౌరస్తావరకు పదసంచలనం కార్యక్రమం నిర్వహించారు. కదం కదం కలుపుదాం అంటూ హిందు సంఘటిత శక్తిని సమాజనికి చాటే విధంగా పాటలు పాడుతూ కవాతు నిర్వహించారు ఈరోజు భారత దేశం లోని ముఖ్య నగరాలు స్వయం సేవకులందరూ కవాతు లొ పాల్గొనటం జరుగుతుంది ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ శాఖ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు , నాయకులు కొలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## పోతుల బాబురావు కుటుంబానికి 10,000 వేల ఆర్థిక సహాయం...



- ఎస్ఎస్సి జెడ్పిహెచ్ఎస్ 1999-2000 పూర్వ విద్యార్థులు..

**కరపత్రం వీణవంక,నవంబర్ 3.**
వీణవంక మండల కేంద్రంలో గత పది రోజుల క్రితం ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థులు 1999-2000 పూర్వ విద్యార్థులు గెట్ టుగెదర్ ప్రోగ్రాం ఏర్పాటు చేయగా,అందులోమిగిలిన పదివేల రూపాయలు తోటి మిత్రుని కుటుంబ ఆర్థిక పరిస్థితులను చూసి రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పోతుల బాపూరావు కుటుంబానికి పదివేల రూపాయలను పూర్వ విద్యార్థులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, ఉయ్యాల రాజు,గెల్లు కుమారస్వామి,సమ్మన్న మహమ్మద్ అమర్,మోటం శ్రీనివాస్,మమ్మద్ కాజా,పిట్టల సురేష్,కళ్యాణం రాజు,ఎం.శ్రీనివాస్, కోమల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో మంచినీటి కోసం తిప్పలు, నీటి ట్యాంకర్ తో ఇంటింటికి సరఫరా..

**కరపత్రం వీణవంక, నవంబర్ 3.**



వీణవంక మండలం మామిడాలపల్లి (గొల్లపల్లిలో) పది రోజులుగా నీటి సమస్యను కాలనీవాసులు ఎదుర్కొంటున్నారు. ఎన్నిసార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి కి నీటి సమస్యపై తెలియజేసినప్పటికీ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పంచాయతీ నిధులు లేనటువంటి పరిస్థితి అని చెప్పడం ఇదే సమస్య ప్రతిరోజు కొనసాగడం బాధ నుంచి నీటి ట్యాంకర్ ద్వారా ప్రతిరోజు నీటిని సరఫరా చేసే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి గ్రామ సమస్యలపై దృష్టి పెట్టాలని అని యాదవ సంఘ అధ్యక్షులు మ్యాకల కొమురయ్య కోరారు ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తగా ఎల్లప్పుడూ ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం కొట్లాడే వ్యక్తి సామాజిక కార్యకర్త మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కి తెలియజేయడం జరిగింది. వారి ద్వారా అయినా పై అధికారులకు తెలియాలని ఆలోచనతో వారిని సంప్రదించి ఈ కార్యక్రమంలో తను మాట్లాడుతూ... ప్రస్తుత ప్రభుత్వం పైన చెడు పేరు వచ్చే అవకాశం ఉంది ప్రజలకు ఇబ్బంది పడకూడదు ఇది ప్రజా పాలన ప్రజలపై దృష్టి పెట్టాలని ఏమాత్రం నిర్లక్ష్యం వ్యవహరించిన చర్యలు తప్పవు అని కాంగ్రెస్ పార్టీ విధి విధానాలతో ప్రజలకు పనిచేస్తుంది అని కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘ ఎన్ ఎస్ యు ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండేటి మహేష్ తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ నేత వంగ రమేష్, రాకేష్,రాజు, ప్రవీణ్,మనోజ్, ప్రదీప్,సది, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం నవంబర్ 04 2024



# టాలీవుడ్‌లో ఇదొక అత్యుత్తమ చిత్రం: విశ్వక్‌సేన్ రివ్యూ

'లక్కీభాస్కర్' పై తన అభిప్రాయాన్ని తెలియజేశారు నటుడు విశ్వక్‌సేన్ . సినిమా అద్భుతంగా ఉందంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. "నిన్న రాత్రి 'లక్కీ భాస్కర్' చూశా. అత్యుత్తమ చిత్రాల్లో ఇదొకటి. మునుపెన్నడూ లేనివిధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించి దర్శకుడిగా వెంకీ అట్లూరి ఉన్నత శిఖరాలను అందుకున్నారు. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లోనే ఇది బెస్ట్ పెర్ఫార్మెన్స్. మీనాక్షి చౌదరి కూడా మంచి ప్రదర్శనతో ఆకట్టుకుంది. జీవీ ప్రకాశ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అద్భుతంగా ఉంది. నిర్మాత నాగవంశీ తోపాటు ఉత్తమ కంటెంట్‌ను అందించిన టీమ్ అందరికి నా అభినందనలు. థియేటర్లలో ఈ అనుభూతిని పొందే అవకాశాన్ని కోల్పోకండి. ఈ సినిమా మరెన్నో విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నా" అని పేర్కొన్నారు.దీనిపై దుల్కర్ స్పందించారు. "థాంక్యూ బ్రదర్. మీకు ఈ సినిమా నచ్చినందుకు ఆనందంగా ఉంది. 'మెకానిక్ రాకీ' విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా" అని తెలిపారు. 1980-90ల్లో బ్యాంకింగ్ సెక్టార్ నేపథ్యంలో దీనిని తీర్చిదిద్దారు. భాస్కర్ అనే మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఓ సాధారణ బ్యాంక్ ఉద్యోగి.. కుటుంబ బాధ్యతలు నెరవేర్చడం కోసం ఎలాంటి రిస్క్ చేశాడనే కథతో దీనిని రూపొందించారు. అతడి సతీమణి సుమతి పాత్రలో మీనాక్షి చౌదరి ఆకట్టుకున్నారు. వెంకీ మేకింగ్, దుల్కర్ యాక్టింగ్‌ను మెచ్చుకుంటూ పలువురు పోస్టులు పెడుతున్నారు. మూడు రోజుల్లో ఈ సినిమా రూ.39.9 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది.విశ్వక్ సేన్ ప్రస్తుతం 'మెకానిక్ రాకీ' విడుదల పనుల్లో బిజీగా ఉన్నారు. రవితేజ ముళ్లపూడి దర్శకుడు. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. నవంబర్ 22న విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆకట్టుకున్నాయి

# అల్లు అర్జున్‌తో శ్రీలీల?





కథానాయకుడు అల్లు అర్జున్ దర్శకుడు సుకుమార్ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప 2: ది రూల్'. 'పుష్ప: ది రైజ్'కు కొనసాగింపుగా ముస్తాబవుతున్న ఈ సినిమా ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. కానీ, ఇప్పటికీ ఇందులోని ప్రత్యేక గీతంలో బన్నీతో కలిసి నర్తించే నాయిక ఎవరన్నది స్పష్టత రాలేదు. ఈ పాట కోసం శ్రద్ధా కపూర్‌తో పాటు పలువురు బాలీవుడ్ నాయికల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడా అవకాశం శ్రీలీలకు దక్కనున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనిపై ఆమెతో సంప్రదింపులు పూర్తయ్యాయని.. తను కూడా సానుకూలంగా స్పందించిందని తెలుస్తోంది. ఈ వారంలోనే పాట చిత్రీకరణను ప్రారంభించనున్నట్లు తెలిసింది. దీనికోసం రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేక సెట్‌ను సిద్ధం చేస్తున్నారు. అందులోనే ప్రేమ్ రక్షిత్ నేతృత్వంలో ఈ ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించే అవకాశముంది. ఈ పాటతో మొత్తం చిత్రీకరణను ముగించనుంది చిత్ర బృందం. ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా కనిపించనుండగా.. ఫహాద్ ఫాజిల్, సునీల్, అనసూయ తదితరులు ముఖ్య పాత్రల్లో సందడి చేయనున్నారు.

# బాధతో అలా మాట్లాడానంతే!



"తొలిసారి 'క' క్లైమాక్స్ గురించి విన్నప్పుడు ఆశ్చర్యపోయా. ఇప్పుడు ప్రేక్షకులు దీన్ని ఇంతగా ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు" అన్నారు కిరణ్ అబ్బవరం. ఆయన హీరోగా నటించిన ఈ 'క' చిత్రాన్ని సుజీత్ - సందీప్ సంయుక్తంగా తెరకెక్కించారు. చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మించారు. నయన సారిక, తన్వి రామ్ కథానాయికలు. ఈ సినిమా ఇటీవల విడుదలైన సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. "మా చిత్రానికి ఘన విజయాన్ని అందించి ఈ దీపావళికి నాకు పెద్ద పండుగ ఇచ్చారు. ప్రీరిలీజ్ వేడుకలో అలా ఎమోషనల్ స్పీచ్ ఇవ్వాలనుకోలేదు. మా అమ్మ పడిన కష్టం గురించి చెప్పాలనుకున్నా. గతేడాది పడిన మాటల వల్ల వచ్చిన బాధతో అలా మాట్లాడా. అంతేకానీ ఇతరుల్ని ఇబ్బంది పెట్టేలా.. తక్కువ చేసేలా మాట్లాడలేదు. ఈ చిత్రాన్ని ఈనెల 8న మలయాళంలో విడుదల చేయనున్నాం. అలాగే తమిళనాట కూడా షోస్ వేయమని అడుగుతున్నారు. అన్ని చోట్లా హౌస్‌ఫుల్స్ కనిపించడం సంతోషంగా ఉంది. ఈ విజయం నాకు గౌరవాన్ని తీసుకొచ్చింది" అన్నారు. ఈ కార్యక్రమంలో సుజీత్ - సందీప్, గోపాలకృష్ణ రెడ్డి, వంశీ నందిపాటి, నయన సారిక, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



# స్టార్ హీరోల సినిమాల్లో రెమ్యునరేషన్ అలా ఉంటుంది

తెలుగులో ప్రముఖ డైరెక్టర్ కె. రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వచ్చిన "ఝుమ్మంది నాదం" సినిమాతో టాలీవుడ్ కి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది ముంబై బ్యూటీ తాప్సీ. ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో వరుస తెలుగు సినిమాల్లో నటించి తెలుగు ఆడియన్స్ ని మెప్పించింది. కానీ రాన్రాను తెలుగు సినిమాలకి గుడ్ బై చెప్పి బాలీవుడ్ లో సెటిల్ అయ్యింది. ఇటీవలే నటి తాప్సీ బాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ల రెమ్యూనరేషన్, అవాకశాలు వంటి విషయాలపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇందులో భాగంగా హీరోయిన్లు స్టార్ హీరోల సినిమాల్లో నటించినంత మాత్రాన ఎక్కువ రెమ్యూనరేషన్ అందుకుంటారని చాలామంది అనుకుంటారాని అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. అలాగే తాను కూడా గతంలో షారూఖ్ ఖాన్ హీరోగా నటించిన డంకీ, జుడ్వా 2 చిత్రాల్లో నటించినప్పుడు హీరోలతో పోలిస్తే చాలా చిన్నమొత్తంలో రెమ్యూనరేషన్ అందుకున్నానని చెప్పుకొచ్చింది.ఇక హీరోయిన్ల కి రెమ్యూనరేషన్ ఇచ్చే విషయంలో దర్శకనిర్మాతలు రకరకాల మైండ్ సెట్ తో ఉంటారని తెలిపింది. ఈ క్రమంలో స్టార్ హీరో సినిమాలో ఆఫర్ ఇస్తున్నప్పుడు రెమ్యూనరేషన్ తో పనేముందని కొందరంటే, మరికొందరు మాత్రం సినిమా మొత్తం హీరోపైనే నడుస్తుంది కాబట్టి హీరోయిన్ కి పెద్దగా పనుండదని దాంతో వారికి తోచినంత ఇచ్చింది తీసుకోవాలంటారని చెప్పుకొచ్చింది. మరికొందరైతే రెమ్యూనరేషన్ డిమాండ్ చేస్తే సింపుల్ గా హీరోయిన్స్ ని మార్చేస్తారని దీంతో హీరోయిన్లు రెమ్యునేషన్ విషయంలో కాంప్రమైజ్ కావాల్సి వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేసింది.ఈ విషయం ఇలా ఉండగా బాలీవుడ్ కి వెళ్ళిన తర్వాత డిఫరెంట్ జోనర్ సినిమాల్లో నటించింది. ఈ క్రమంలో లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో కూడా నటించి మెప్పించింది. కాగా ప్రస్తుతం తాప్సీ హిందీలో స్కామ్ 1992 వెబ్ సీరీస్ ఫేమ్ పాత్రిక్ గాంధీ హీరోగా నటిస్తున్న "ఓ లడ్కీ హై కహాన్" సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాకి అర్షద్ సయ్యద్ దర్శకత్వం వహిస్తున్నాడు.

# కాంతార కోసం హాలీవుడ్ స్టంట్ మాస్టర్ ని దింపిన రిషబ్ శెట్టి..

కన్నడలో ప్రముఖ హీరో మరియు డైరెక్టర్ రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన కాంతార సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయిన విషయం తెలిసిందే. ఈ సినిమాని మేకర్స్ కన్నడతో పాటూ తెలుగు, తమిళ్ మలయాళం తదితర భాషలలో రిలీజ్ చేశారు. ఎటువంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన ఈ సినిమా వరల్డ్ వైడ్ గా దాదాపుగా రూ.450 కోట్లు(గ్రాస్) కలెక్ట్ చేసి రికార్డులు క్రియేట్ చేసింది. అలాగే ఈ సినిమాతో హీరో రిషబ్ శెట్టి క్రేజ్ ఒక్కసారిగా పెరిగింది. దీంతో కాంతార :చాప్టర్ 1 సినిమా మేకింగ్ విషయంలో రిషబ్ శెట్టి చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నాడు.

:చాప్టర్ 1 లోని ఫైట్స్ కోసం హాలీవుడ్ కి చెందిన టోడర్ లాజరోవ్ ని తీసుకొచ్చారు. దీంతో ప్రస్తుతం టోడర్ లాజరోవ్ తో రెండు యాక్షన్ సన్నివేశాలని తీస్తున్నట్లు సమాచారం. అయితే టోడర్ లాజరోవ్ హాలీవుడ్ లో ఇన్ హెల్, రెడ్ ఫ్యాక్షన్ తదితర సినిమాలకి పని చేశాడు. ముఖ్యంగా తెలుగులో ప్రముఖ డైరెక్టర్ జక్కన్న ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కించిన ఆర్.ఆర్.ఆర్ సినిమాకి కూడా స్టంట్ మాస్టర్ గా పని చేశాడు. దీంతో టోడర్ లాజరోవ్ పని తీరుని మెచ్చిన రిషబ్ శెట్టి బల్గెరియా నుంచి తీసుకొచ్చి కాంతార : చాప్టర్ 1 లో అవకాశం ఇచ్చినట్లు సమాచారం.
ఈ విషయం ఇలా ఉండగా రిషబ్ శెట్టి ప్రస్తుతం టాలీవుడ్ లో కూడా వరుస ఆఫర్లు దక్కించుకుంటున్నాడు. ఈ క్రమంలో తెలుగు స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ డైరెక్ట్ చేస్తున్న జై హనుమాన్ సినిమాలో హనుమాన్ పాత్రలో నటిస్తున్నాడు. ఇటీవలే జై హనుమాన్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చెయ్యగా మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే ప్రముఖ సినీ నిర్మాణ సంస్థయిన సితార ఎంటర్టైన్ మెంట్స్ నిర్మిస్తున్న మరో భారీ బడ్జెట్ సినిమాలో కూడా హీరోగా నటిస్తున్నాడు.

